సాక్షి బాపట్ల

శుక్రవారం। 6। సెప్టెంబర్। 2024



57 వేల క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 57,456 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 30,401 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



కేంద్ర మంత్రికి స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు విమానాశ్రయంలో నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 587.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 8,529 క్యూసెక్కులు వదిలారు.



వరద ప్రవాహం కారణంగా కోతకు గురైన కొల్లూరు - గాజుల్లంక రోడ్డు

వరద దారిద్ర్యం

• తీవ్రంగా దెబ్బతిన్న రహదారులు • రాకపోకలకు ఇబ్బందులు • బురదకయ్యలుగా గ్రామాలు

జిల్లాలో వరద బీభత్సానికి ఇళ్లు నీట మునగ్గా, పంటపొలాలు సంద్రాన్ని తలపిస్తున్నాయి.. రహదారుల ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. రోడ్లన్నీ కోతకు గురై నడిచేందుకు కూడా వీలులేని దుస్థితి నెలకొంది. వరదముంపు నుంచి బయటపడి ఎక్కడికైనా వెళ్దామన్నా వీలులేనంతగా అవి పాడయ్యాయి. గ్రామాలకు గ్రామాలకు మధ్య అనుసంధానం దెబ్బతిని రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. దీనికి తోడు వరద మిగిల్చిన బురదతో గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయి.

కొల్లూరు: కృష్ణమ్మ ప్రకోపంతో పంట పొలాలు ముంపునకు గురవడం, జనావాసాలు నీట మునగడంతోపాటు రహదారులు సైతం కోతలకు గురై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల ప్రభావంతో మండలంలోని పలు రహదారులు కోతలకు గురై, ఛిద్రమవడంతో వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి, వాహనాల రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలోని పెసర్లంక - కొత్తూరులంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, పోతార్లంక - గాజుల్లం, కొల్లూరు - గాజుల్లంక రోడ్లకు కోతలు పడటంతో ప్రజలు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. కొల్లూరు-గాజుల్లంక, పెసర్లంక -కొత్తూరులంక మార్గాలు వరదనీటి ప్రవాహం కారణంగా ఎక్కడికక్కడ గండ్లు పడటంతో పూర్తిగా ఛిద్రమయ్యాయి. మండలంలోని సుమారు 30 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమైనట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. సీఎం చంద్రబాబు పర్యటన ఉండటంతో పెసర్లంక -కొత్తూరులంక, కొల్లూరు - గాజుల్లంక మార్గాల్లో ఏర్పడిన రహదారి కోతలను స్టోన్‌డస్ట్‌తో పూడ్చి యుద్ధప్రాతిపదికన మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని తోకలవారిపాలెం, శివారు తురకపాలెం ఇటుక బట్టీల కోసం రహదారి అంచుల సమీపంలోకి మట్టి తవ్వకాలు చేపట్టిన ఫలితంగా, రహదారి అంచుల వరకు భారీ గండ్లు ఏర్పడి ఆమార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తిప్పలకట్ట, తదితర గ్రామాలలో సైతం రహదారి అంచులకు కోతలు ఏర్పడడంతో రహదారులు ఛిద్రమయ్యాయి.

'బురద' కష్టాలు

రేపల్లె రూరల్: వరద ముంపు నుంచి పెనుమూడి పల్లెపాలెం కాస్తంత ఊపిరి పీల్చుకుంది. గృహాల్లో నుంచి వరద నీరు తగ్గినా.. ఇళ్లు, రోడ్లు అన్నీ బురదమయంగా మారాయి. అడుగేసి తీయలేని విధంగా రహదారులు, గృహాల సముదాయాలను నల్లరేగడి మట్టి కప్పేసింది. నాలుగు రోజులకు పైగా నీటిలో నానటంతో ఇప్పటికే పలు కచ్చాగృహాలు నేలకొరగగా మరికొన్ని బాగా దెబ్బతిన్నాయి. కాలనీచుట్టూ నీరు చేరటంతో పాటు బురద చేరటంతో భరించలేని దుర్గంధం వస్తుందని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం లోపించటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయాందోళనలు చెందుతున్నారు.

దెబ్బతిన్న మాన్యువల్ ఫెన్సింగ్ మెషిన్..

వరదల తాకిడికి పెనుమూడి పల్లెపాలెంలో ఇటీవల ఏర్పాటు చేసిన మ్యాన్యువల్ ఫెన్సింగ్ మెషిన్ షెడ్డు కోతకు గురై గోడలు నేలకొరిగాయి. నాలుగు రోజుల పాటు నీటిలో నానడంతో ఫెన్సింగ్ మిషన్‌తో పాటు పెద్ద పెద్ద మోటారు, గ్యాస్‌వెల్డింగ్ మిషన్‌లు పూర్తిగా పాడైపోయాయని నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.



తురకపాలెం సమీపంలో వరద నీటి ప్రవాహానికి కోతకు గురైన రోడ్డు

వంతెన నిర్మాణం చేపట్టాలి



వరద సమయంలో ప్రజలు సురక్షితంగా బయట ప్రాంతాలకు తరలివెళ్లడానికి వీలుగా వంతెన నిర్మాణం చేపట్టాలి. భట్టిప్రోలు మండలం వెల్లటూరు కరకట్ట దిగువున పల్లపు ప్రాంతంలోకి వరద నీరు వస్తుండటంతో సుమారు 10 లంక గ్రామాల ప్రజలు వరద నీటిలో చిక్కుకుపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి లోలెవల్ వంతెనల స్థానంలో నూతన వంతెనలను నిర్మించాలి.

– పులివర్తి పసి, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

ఇళ్లు, పంటలు మునిగాయి



కృష్ణా నది వరదలతో పంటలు మునిగి పోయి తీవ్రంగా నష్టపోయాను. నీరు రావడంతో ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పంటలతో పాటు, దెబ్బతిన్న ఇళ్లకు కూడా నష్ట పరిహారం చెల్లించాలి. అధికారులు మాత్రం పంట నష్టపరిహారం మాత్రమే ఇస్తామని చెబుతోంది. దెబ్బతిన్ని ఇళ్లకు కూడా నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-జె సురేష్, పెసర్లంక, కొల్లూరు మండలం

రుణాలు రద్దు చేయాలి



వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులు, పాడి రైతులకు రుణాలు రద్దు చేయాలి. వరద వల్ల పంటలు నష్ట పోవడంతో పనుల్లేవు. కొత్త రుణాలివ్వాలి. లంక గ్రామాల్లో డ్వాక్రా గ్రూపులకు కూడా రుణాలు రద్దు చేసి, కొత్తవి ఇవ్వాలి.

- తోడేటి సురేష్, చింతర్లంక, కొల్లూరు మండలం

రూ.15 లక్షలకుపైగా నష్టం..



బ్యాంకు నుంచి రుణం పొంది మార్చి నెలలో ఫెన్సింగ్ మిషన్ యూనిట్‌ను నెలకొల్పాం. ఈ యూనిట్‌తో నాతో పాటు మరో 10 మందికి ఉపాధి లభిస్తోంది. నదికి వరద వస్తుందని చెప్పటంతో భయపడుతూనే షెడ్డుకు తాళాలు వేసి ఒడ్డుకు చేరాం. వరద తాకిడికి షెడ్డు కోతకుగురై గోడకు నేలకొరగటంతో పాటు రూ.4లక్షల విలువైన రా మెటీరియల్ వరదలో కొట్టుకుపోయింది. రూ.15లక్షల విలువైన మ్యాన్యువల్ ఫెన్సింగ్ మిషన్, గ్యాస్‌వెల్డింగ్ మిషన్‌లు పూర్తిగా తడిచి పాడైపోయాయి. రూ.15 లక్షలకుపైగా నష్టపోయాను. ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కొక్కిలిగడ్డ శిరీష, నిర్వాహకురాలు, పెనుమూడి పల్లెపాలెం

కష్టమంతా కృష్ణమ్మ పాలు



ఆరుగాలం శ్రమించిన కష్టమంతా కృష్ణమ్మ పాలైంది. కౌలు చెల్లించి అప్పులు చేసి రూ.2లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి అర ఎకరంలో కంద పంటను, అర ఎకరంలో పసుపును సాగు చేశాను. రెండు నెలలు ఉంటే కంద పంట చేతికొచ్చేది. చేసిన అప్పులు కొంతైనా తీరేవి. ఈలోపు వరద వచ్చి మా పంటలను తుడిచిపెట్టేసింది. ప్రభుత్వం కనీస పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలి.

- జి.రాంబాబు, కౌలురైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

ఇప్పటివరకు ఎవరూ రాలేదు



60 సెంట్లలో మిర్చి సాగు చేయగా వరద తాకిడికి మొత్తం కొట్టుకుపోయింది. ఇప్పటికే రూ.40వేలు పెట్టుబడి వరద పాలైంది. ప్రభుత్వం ఆదుకోకపోతే అప్పులు తీర్చేమార్గం కనిపించటంలేదు. ఇప్పటివరకు పంటలు పరిశీలించేందుకు ఏ అధికారి రాలేదు. అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి ఆదుకోవాలి.

పులివర్తి కోటయ్య, కిష్కిందపాలెం, కౌలురైతు, కొల్లూరు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



కృష్ణ నదికి వచ్చిన వరదలు కోలుకోలేని దెబ్బ తీశాయి. అప్పులు చేసి మరీ ఎకరాకు రూ.45వేలు కౌలు చెల్లించాను. 70 సెంట్లలో పసుపు, అర ఎకరంలో అరటి, అర ఎకరంలో కంద సాగు చేసి ఇప్పటికే రూ.3.50లక్షలు పెట్టుబడి పెట్టాను. మరో 20రోజుల్లో అరటి పంట చేతికొచ్చేది. ఈ సమయంలో వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- గునిపల్లి మార్క్, కౌలు రైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

ఎటువంటి సాయం అందలేదు



సాగుభూమిని కౌలుకు తీసుకుని రెండు ఎకరాలలో పసుపు, అర ఎకరంలో కంద సాగుచేస్తూ ఇప్పటికే రూ.3లక్షల పెట్టుబడి పెట్టాను. వరద నీటిలో పంట కొట్టుకుపోయింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా వచ్చేది. ఈ ప్రభుత్వం ఎటువంటి పెట్టుబడి సాయం అందించలేదు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోవడంలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కొల్లి రామారావు, కౌలురైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

నష్ట నమోదు ప్రక్రియ వేగవంతం

జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి



కొల్లూరులో నష్ట నమోదుపై సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

కొల్లూరు: కృష్ణానదీ వరదల కారణంగా ఏర్పడిన నష్ట నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం కొల్లూరు గ్రంథాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నష్ట నమోదు ప్రక్రియలో అవలంభించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు. ఒక్క రోజులో వరద ప్రభావిత గ్రామాల్లోని గృహాల నష్టాన్ని నమోదు చేయాలని ఆయన ఆదేశించగా, కనీసం మూడు రోజుల వ్యవధి ఇవ్వాలని సిబ్బంది కోరారు. దీంతో ఆయన అనుమతించారు. శుక్రవారం నుంచి గృహ నష్టం, పంట నష్టాల నమోదును అతితక్కువ రోజుల్లో పూర్తి చేయడానికి అవసరమైనన్ని బృందాలను ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నష్ట నమోదు విషయంలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి నమోదు చేపట్టాలని, నమోదు బృందాలు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్య పనుల నిర్వహణ, సహాయక కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. గ్రామాలలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా వ్యవహరించాలని సూచించారు. ఆర్డీఓ హేలాషారోన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొల్లూరు మండలం గాజుల్లంక వద్ద నీట మునిగి ఉన్న ఇటుక బట్టీలు



కొల్లూరు మండలం పెసర్లంకలో ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరకుల కోసం బారులు తీరిన ప్రజలు



భట్టిప్రోలు మండలం పెసర్లంక జెడ్పీ హైస్కూల్‌లో వరదకు చేరిన బురద, ఒండ్రును తొలగిస్తున్న ఉపాధ్యాయులు



కొల్లూరు మండలం దోనేపూడి కరకట్ట దిగువున వరద నీటిలో అరటి తోట

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విపత్తు

- నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి
- ముంపు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ బృందం పర్యటన

వేమూరు,భట్టిప్రోలు: కృష్ణా నది వరదల వల్ల పంటలు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. వరద ముంపు వల్ల మునిగిపోయిన పంట పొలాలను వైఎస్సార్ సీపీ బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. లంక గ్రామాల్లో అరవింద వారధిపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ వరదల వల్ల మునిగిపోయిన పంటలను విభజించి పంట నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలన్నారు. మునిగిపోయిన పంటలను సర్వే చేయించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ విపత్తు వచ్చినపుడు ప్రభుత్వం ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదన్నారు. పంట నష్ట పోయిన ప్రతి రైతుకు రూ.లక్ష చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు పార్టీలకతీతంగా పంట నష్టం చెల్లించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను తీర్చాలన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలన్నారు. వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన అధ్యక్షుడు మేరుగ చందన్ నాగ్, పెరికల పద్మారావు, బొల్లిముంత ఏడుకొండలు, మోదుకూరి హరిబాబు, కనపర్తి మోహనరావు, సిరాజుద్దిన్, జల్లి జోషి కాంత్, కర్రెం శెట్టి బాలు, జడా రవీంద్ర, అవుతు పోతు రెడ్డి, సంజీవ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బుర్లా దుర్గ, మన్న ప్రభాకరావు, హరిప్రసాద్, శేషా చలం, మోర్ల శ్రీను, పడమటి శ్రీను పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లంక గ్రామాల్లో మునిగిపోయిన పంట పొలాలు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రైతులను ఆదుకోవాలి..

రేపల్లె రూరల్: వరదలు, వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరు గణేష్ డిమాండ్ చేశారు. వరదలతో దెబ్బతిన్న పెనుమూడి పల్లెపాలెం గృహాలను, పంట పొలాలను గురువారం వైఎస్సార్ సీపీ బృందంతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించకపోవటంతోనే వరద విపత్తు సంభవించిందన్నారు. పక్కా ప్రణాళికతో పని చేసినట్లయితే తీరప్రాంతానికి వరద ముంపు తప్పేదన్నారు. రాజకీయాలు వీడి పార్టీలకు అతీతంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ దేవాంగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా 'బీరక'



బీరక సురేంద్ర

చీరాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర దేవాంగ విభాగం అధ్యక్షుడిగా చీరాలకు చెందిన బీరక సురేంద్రను నియమిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన బీరక సురేంద్ర పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. దీంతో ఆయనను పార్టీ రాష్ట్ర దేవాంగ విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష పదవిని అందించిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో బడా మోసం

- నలుగురు నిందితుల అరెస్టు
- రూ. లక్ష నగదు స్వాధీనం
- 19 లక్షల చిన్నారులు ఆడుకునే ఫేక్ నోట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్ నాయక్



వివరాలు వెల్లడిస్తున్న చీరాల డీఎస్పీ

చీరాల టౌన్: తక్కువ ధరకే బంగారం ఇస్తాం.. డబ్బులు కడితే ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తాం. రూ.లక్ష నగదుకు రూ.6 లక్షల దొంగనోట్లు ఇస్తాం.. వంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని ఈపురుపాలెం పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన సూరిన పోలిరెడ్డి ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఐటీసీలో ఉద్యోగం ఇప్పిస్తామని బాపట్ల మండలం వెదుళ్లపల్లికి చెందిన పోలా హరీష్, కరీంనగర్‌కు చెందిన కౌశిక్, నెల్లూరుకు చెందిన గుత్తి భరత్‌కుమార్, చీరాల వాడరేవుకు చెందిన రాగిరి శివమల్లికార్జున్, పాలపర్తి సాయి, బెల్లంకొండ రాములు నమ్మబలికి జూలై 12న వాడరేవులోని వైఎస్సార్ కాలనీకి తీసుకెళ్లారు. చీటింగ్ చేసి దొంగనోట్లు మార్చేందుకు వచ్చావా అని అతన్ని భయపెట్టి బాధితుడు పోలిరెడ్డిని బెదిరించి రూ.1.50 లక్షలు నగదును తీసుకుని నిందితులు పరారయ్యారని తెలిపారు. దీంతో తనను మోసం చేశారని తెలుసుకున్న పోలిరెడ్డి చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు..

ఈ ఉదంతంపై ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు తీసుకున్నామని డీఎస్పీ చెప్పారు. నిందితుల్లో నలుగురు భరత్, మల్లికార్జున్, సాయి, రాములు వాడరేవులోని మస్తాన్‌రెడ్డి గెస్ట్‌హౌస్ వద్ద చిన్నారులు ఆడుకునే నోట్లు (చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) రూ.19 లక్షల నోట్లతో అనుమానంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకోగా నేరం రుజువైందన్నారు. నిందితులు నలుగురి వద్ద నుంచి రూ. లక్ష నగదు, చిన్నారులు ఆడుకునే నోట్లు రూ.19 లక్షలు స్వాధీనం చేసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న పోలా హరీష్, కరీంనగర్‌కు చెందిన కౌశిక్‌లను మరికొన్ని రోజుల్లో అరెస్టు చేస్తామన్నారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ సత్యనారాయణ, ఎస్సై శివకుమార్, సిబ్బంది బాలచంద్ర, శ్రీను, అచ్చియ్య, సుబ్బారావులను ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

- బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్
- 14 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేత



అవార్డులతో ఉత్తమ ఉపాధ్యాయులు

బాపట్ల: ఉపాధ్యాయ వృతి ఎంతో గొప్పదని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉత్త మ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం ఘనంగా నిర్వహించారు. అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన సభలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయులను గౌరవించుకోవడం సంతోషంగా ఉందన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థుల గురించి పట్టించుకున్న వారే గొప్ప ఉపాధ్యాయులన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మందిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. డీఆర్‌ఓ సత్తిబాబు, డీఈఓ కె.నారాయణ,డిప్యూటీ డీఈఓ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టరు డీడీ స్మిత్ పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.